క్లుప్తంగా

నేటి నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

సాక్షి నెట్‌వర్క్: నేటి (మంగళవారం) నుంచి పలు మండలాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ కార్యాలయం నుంచి ప్రకటనలు విడుదలయ్యాయి. మణుగూరు, అశ్వాపురం, దుమ్ముగూడెం, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మండలాల్లో ఏ పంచాయతీలో ఏ రోజు సదస్సు నిర్వహించేది రెవెన్యూ సిబ్బంది నిర్ణయిస్తారు. ఈ మేరకు ఇప్పటికే షెడ్యూల్ సిద్ధపరిచారు. ఆయా సదస్సుల్లో పంచాయతీలో పట్టా భూములు, పాసుపుస్తకం తదితర భూ సమస్యల గురించి దరఖాస్తులు స్వీకరిస్తారు. తగిన ఆధారాలను దరఖాస్తులకు జతచేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమాలు ఆయా మండలాన్నిబట్టి 10 నుంచి 20 రోజుల పైచిలుకు వరకు కొనసాగనున్నాయి. కాగా, సదస్సులకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రజలు గమనించి హాజరు కావాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

నేటి నుంచి మున్సిపాలిటీ వార్డుల విభజన ప్రక్రియ

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ వార్డుల డివిజన్ విభజన ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించి, ఈ నెల 21వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు కమిషనర్ కె.సుజాత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విభజన ప్రక్రియకు ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతోపాటు పట్టణంలోని ప్రముఖులు, సాధారణ ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఆయా అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి వాటిలో ఆమోదయోగ్యమైన వాటిని గుర్తించి వార్డుల విభజన చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

ఏసీఎంఓ బాధ్యతలు స్వీకరణ


రమేష్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలోని ప్రాజెక్టు మానిటరింగ్ విభాగంలో ఏసీఎంఓగా రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ విభాగంలో పనిచేస్తున్న రమణయ్య పదవీ విరమణ చేయటంతో రమేష్‌కు ఈ బాధ్యతలను అప్పగించారు. బాధ్యతలను స్వీకరించిన అనంతరం రమేష్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


వ్యర్థాలను తొలగించిన ఫారెస్ట్ అధికారులు

పినపాక: పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి ఆధ్వర్యంలో ఈ బయ్యారం అటవీశాఖ సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. జానంపేట గ్రామ సమీపంలోని ఆర్ఎఫ్ఆర్ ఏరియాలో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, డబ్బాలు ఏరివేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుకు శ్రమదానం


రోడ్డు వేసుకుంటున్న గ్రామస్తులు

గుండాల: మండల పరిధిలోని బోడాయికుంట గ్రామస్తులు 30 సంత్సరాలుగా ఇక్కడ జీవనం సాగిస్తున్నప్పటికీ సీసీ రోడ్డు సౌకర్యం లేదు. సాధారణ మట్టిరోడ్డుతో ఇప్పటి వరకు నెట్టుకొస్తున్నారు. అది కూడా గుంతలతో మరమ్మతులకు గురై నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తమ గ్రామానికి రోడ్డు లేదని స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఫలితం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు స్వతహాగా ప్రతి ఇంటికి కొంత డబ్బు చందా వేసుకుని ఉన్న మట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మొర మట్టిని తోలించి రోడ్డుపై ఉన్న గుంతలను, బురదను పూడ్చివేశారు. తమ పడుతున్న కష్టానికి ఇకనైనా అధికారులు, నాయకులు చొరవ తీసుకొని తమ గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

రైల్వేలైన్ నిర్వాసితులకు పరిహారం చెక్కులు

మణుగూరురూరల్: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ రైల్వేట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోయిన ముగ్గురు లబ్ధిదారులకు రూ.16.50 లక్షల విలువ చేసే నష్టపరిహార చెక్కులను సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేష్, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు పాల్గొన్నారు.

జై తెలంగాణ.. జైజై తెలంగాణ!

ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా ఎగురవేసి మిఠాయిలను పంచి పెట్టారు. తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ప్రొఫెసర్ జయశంకర్, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల తీరును వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: అమరవీరులకు నివాళులర్పిస్తున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి


భద్రాచలం: ఎమ్మెల్యే వెంకట్రావు జెండావిష్కరణ..


దమ్మపేట: పట్వారిగూడెంలోని వేడుకల్లో కళాకారులతో కలసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ



భద్రాచలం: జెండా ఆవిష్కరణ చేస్తున్న రామాలయ ఈఓ ఎల్.రమాదేవి


బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు..


మణుగూరురూరల్: జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


చండ్రుగొండ: జెండాకు సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ సంధ్యారాణి, ఉద్యోగులు


అశ్వారావుపేటరూరల్: ఏజీ కళాశాలలో డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో..


ములకలపల్లి తహసీల్ వద్ద తహసీల్దార్ భూక్యా గన్యా, ఎంపీడీఓ..


కరకగూడెం: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ కాంతయ్య


మణుగూరురూరల్: జెండాకు వందనం చేస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి


పినపాక: తహసీల్దార్ గొంది గోపాలకృష్ణ ఆధ్వర్యంలో..


చండ్రుగొండ: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మలి దశ ఉద్యమకారులు..


దమ్మపేట: దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో..


భద్రాచలం: ఆర్‌టీఓ కార్యాలయంలో ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య జెండావిష్కరణ


ఎంపీడీఓ కార్యాలయంలో జెండా వందనంలో పాల్గొన్న అధికారులు


అన్నపురెడ్డిపల్లి : కార్యాలయం ఎదుట జాతీయ జెండావిష్కరణ చేస్తున్న తహసీల్దార్ పుల్లారావు


ఆళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..


అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు..

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ బి.ప్రభాకర్ సూచించారు. సోమవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. 2025–26 విద్యాసంవత్సరానికి గానూ ఆయా కళాశాలల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్ (కోపా)లలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఏటీసీ కేంద్రంలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్, కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసేటప్పుడు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, ఇచ్చిన ఆప్షన్ ప్రకారం ఎన్ని కోర్సులకైనా సీటు పొందే అవకాశం ఉంటుందన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను సమీప ఐటీఐ కళాశాలను ఆప్షన్‌గా ఎంచుకోవాలన్నారు. పూర్తి వివరాలకు iti.telangana.govt.in వెబ్‌సైట్‌ద్వారా తెలుసుకోవడమే కాకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

కరకగూడెం: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ నాగ ప్రసాద్ ప్రమోషన్ మీద బదిలీ కాగా.. ఇక్కడే డీటీగా విధులు నిర్వహిస్తున్న వట్టం కాంతయ్యను పూర్తి స్థాయి తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేయగా.. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల వాసులకు అనుక్షణం అందుబాటులో ఉంటూ మెరుగైన రెవిన్యూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక కార్యాలయంలో తహసీల్దార్‌గా సీహెచ్‌వీ రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్ల నాణ్యతపై చర్చకు సిద్ధమా?


సమావేశంలో మాట్లాడుతున్న ఓరుగంటి భిక్షమయ్య

అశ్వాపురం: రహదారుల నిర్మాణాల్లో నాణ్యతపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య సవాలు విసిరారు. కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మండల కేంద్రంలో డివైడర్ నిర్మాణంపై రేగా నాణ్యత గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ హయాంలో వేసిన సీసీ రోడ్లు నాణ్యతతో ఉన్నాయో, లేదా ప్రస్తుత కాంగ్రెస్ హయాంలోనివి నాణ్యతగా ఉన్నాయో చర్చకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, తూము వీరరాఘవులు, నాయకులు చెంచల రాము, బట్టా సత్యనారాయణ, గొల్లపల్లి నరేష్, శశికాంత్, హర్ష నాయక్, నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


మండల కేంద్రంలో ప్రచార జాతా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘ బాధ్యులు

గుండాల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, నాణ్యమైన విద్యనిందించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా కార్యక్రమంలో భాగంగా సోమవారం కాచనపల్లి, ముత్తాపురం, మామకన్ను, గుండాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించి వాటిని కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, జిల్లా కార్యదర్శి హథిరాం, జయరాజు, రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీఓ

అశ్వాపురం: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ముత్యాలరావు మణుగూరులో సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని రాజాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కామరతి సమేత బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.. నృత్యకారులతో కలసి డప్పు వాయించి కోలాటం ఆడారు. నాయకులు పర్సా వెంకటేశ్వరరావు, వేముల రమణ, దుబాకుల రాము, నరేష్, శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చర్ల: మండలంలోని గొంపల్లి, గుంపెన్నగూడెం గ్రామాలకు చెందిన 40 కుటుంబాల వారు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వీరందరికీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తామంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో చర్ల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గిరిజన విద్యార్థుల సత్తా


భూక్యా దేవి


జర్పుల స్వాతి

భద్రాచలం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భద్రాచలం గిరిజన బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. ఈ మేరకు వివరాలను ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం వెల్లడించారు. ఎంపీసీ గ్రూప్ చదివిన భూక్య దివ్య ఎస్‌టీ విభాగంలో 1030 ర్యాంక్, జరుపుల స్వాతి 1852 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా మరో ఐదుగురు ప్రిపరేటరీ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ, అధ్యాపకుల తర్ఫీదుతో ఈ ర్యాంకులు సాధ్యమైనట్లు వెల్లడించారు.

నకిలీలు విక్రయిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్

చర్ల: రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీఏ సుధాకర్ వ్యాపారులను హెచ్చరించారు. సోమవారం చర్లలోని రైతు వేదికలో విత్తన డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొంత మంది విత్తన డీలర్లు నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నట్లుగా సమాచారం అందుతున్నట్లు, అటువంటి వారిని గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. ప్రతి విత్తన డీలరు దుకాణంలో విక్రయిస్తున్న విత్తనాల వివరాలు, స్టాకు, ఎమ్మార్పీ ధర వివరాలను నోటీసు బోర్డుపై ఉంచాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతీ రైతులు బిల్లు ఇవ్వాలని ఆ బిల్లుపై రైతు సంతకంతో పాటు విక్రయదారుని సంతకం కూడా తప్పకుండా ఉండాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీను మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయశాఖాధికారి లావణ్య, ఏఈఓలు ఆఫ్రిద్, కీర్తి, రామకృష్ణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విత్తన డీలర్లు పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళికపై ర్యాలీ


ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలో అమలు చేసే వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం ప్రారంభోత్సవ ర్యాలీని సోమవారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుంచి పట్టణంలోని రింగ్‌రోడ్డు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, పురవీధుల్లో అధికారులు, సిబ్బంది కలిసి అవగాహన ర్యాలీ చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళికాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో వంద రోజుల కార్యక్రమాన్ని సోమవారం నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 10వ తేదీ వరకు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ వంద రోజుల ప్రణాళికలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని, పట్టణ ప్రజానీకం సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఎం.కామేష్, అప్పన్న, కె.శ్రీను, నాగేంద్ర, రమణ, మురళి, శ్రీకాంత్, భూషణం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వరి పొలాలే క్రీడా మైదానాలు!


మోదుగులగూడెంలో పంట పొలాల్లో క్రికెట్ ఆడుతున్న యువత

గుండాల: గ్రామీణ ప్రాంతాల్లో వివిధ క్రీడల్లో ప్రతిభ ఉన్న యువతకు ప్రోత్సాహం కరువైంది. అక్కడక్కడ నిర్వహించే క్రీడల్లో గ్రామాల జట్లు పాల్గొంటున్నా.. వారు ప్రాక్టీస్ చేసుకునేందుకు సరైన క్రీడా మైదానాలు లేకుండా పోయాయి. దీంతో వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువత వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ ఆటలు ప్రాక్టీస్ చేసుకునేందుకు పంట పొలాలే క్రీడా మైదానాలుగా మారుతున్నారు. గత తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినా అవి నేడు నిరూపయోగంగానే ఉన్నాయి. సరైన స్థలాలలో చదును చేయకుండా ఎక్కడపడితే అక్కడ స్థలాలను కెటాయించారు. ఆ తర్వాత పంచాయతీలకు నిధులు లేక క్రీడా మైదానాలు చూపుకు మాత్రమే దర్శనమిస్తున్నాయి. దీంతో మండలంలో యువత పంట పొలాలను, ఖాళీ స్థలాలను క్రీడా మైదానాలుగా ఉపయోగించుకున్నారు. ఖాళీ సమయాల్లో ఆడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మండలం నుంచి వివిధ క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చే వారున్నారు. క్రీడలు నిర్వహించే అధికారులు, ప్రజా ప్రతినిధులు క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నారు. కానీ క్రీడా మైదానాలు చూపించకపోవడంతో యువత నిరుత్సాహానికి గురౌతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని క్రీడాకారులు కోరుతున్నారు.